క్లుప్తంగా

రాజరాజేశ్వరీదేవికి ప్రత్యేక పూజలు


పూజలందుకుంటున్న అమ్మవారు

బొండపల్లి: ఫాల్గుణమాసం సందర్భంగా దేవుపల్లి గ్రామంలోని రాజరాజేశ్వరీదేవి ఆలయంలో మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు దూసి శ్రీధర్ శర్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. గ్రామస్తులతో పాటు చుట్టు పక్క గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

నిరసన


నిరసనకారులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ ముకుందరావు

లక్కవరపుకోట: మండలంలోని గనివాడ పంచాయతీ శివారు నిడిగట్టు గ్రామంలో పైడితల్లి అమ్మవారి ఆలయ నిర్మాణ పనులను గ్రామానికి చెందిన కొంతమంది అడ్డుకుంటున్నారని అదే గ్రామానికి చెందిన పలువురు స్థానిక పోలీస్ స్టేషన వద్ద మంగళవారం నిరసన తెలిపారు. నిరసనకారులు మాట్లాడుతూ దాతల సహకారంతో ఆలయాన్ని నిర్మిస్తున్నామని చెప్పారు. గుడి నిర్మాణంలో భాగమైన పలు అంశాల్లో తమకు ప్రాధాన్యం ఇవ్వడం లేదని ఆరోపిస్తూ కొంతమంది పనులను అడ్డుకుంటున్నారని, ఇది ఎంతవరకు సబబని ప్రశ్నించారు. ఎస్‌ఐ ఎం.ముకుందరావు గ్రామస్తులతో మాట్లాడుతూ, గ్రామంలో బుధవారం గ్రామసభ ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అప్పటి వరకు సహనం పాటించాలని సూచించడంతో గ్రామస్తులు నిరసన విరమించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చీపురుపల్లి: పట్టణంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో బుధవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటవరకు సబ్‌స్టేషన్ పరిధిలోని పట్టణంతో పాటు 15 గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఆర్‌ఈసీఎస్ ఏడీ బెల్లాన జగన్నాథం మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26, 27, 28వ తేదీల్లో కనకమహాలక్ష్మి అమ్మవారి జాతరకు ఎటువంటి ఆటంకం లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసే కార్యక్రమంలో భాగంగా సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేయిస్తున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

సీఎం జగన్‌కు కృతజ్ఞతలు

చీపురుపల్లి: రాష్ట్రంలో యాదవ కులస్తులకు ఎనలేని ప్రాధాన్యతను కల్పిస్తూ గౌరవిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి యాదవ సామాజిక వర్గం నుంచి కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు అఖిల భారతీయ యాదవ సంఘం చీపురుపల్లి నియోజకవర్గ అధ్యక్షుడు బొంతు తిరుపతి యాదవ్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన నర్తు రామారావుయాదవ్‌ను స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా వైఎస్సార్‌సీపీ తరఫున సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించడాన్ని యావత్ యాదవ సామాజిక వర్గానికి ఇచ్చిన గౌరవంగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. యాదవ సామాజికవర్గం సీఎం జగన్‌కు రుణపడి ఉంటుందని స్పష్టం చేశారు.

ధాన్యం కొనుగోలులో గొడవ

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలం వెదుల్లవలస రైతుభరోసా కేంద్రం వద్ద ధాన్యం కొనుగోలు అంశంపై వీఏఏ కృష్ణారావుకు రైతులకు మధ్య గొడవ జరిగింది. వీఏఏ మాట్లాడుతూ రైతుభరోసా కేంద్రం పరిధిలో ఇంకా రైతుల వద్ద మిగిలి ఉన్న ధాన్యాన్ని ప్రభుత్వం సేకరిస్తోందని, అయితే ధాన్యం మొత్తాన్ని ఒకేసారి కొనుగోలు చేయాలని కొందరు వాగ్వాదానికి దిగిరాని చెప్పారు. గ్రామానికి చెందిన మన్నెపురి శ్రీను, నెమ్మాది రమణ తనను దుర్భాషలాడి, చేతితో తోసేశారని, ఆర్బీకేలో కంప్యూటర్‌ను ధ్వంసం చేశారని తెలిపారు. ఘటనపై జిల్లా జాయింట్ కలెక్టర్ మయూరిఅశోక్‌కు ఫిర్యాదు చేశానని చెప్పారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా


నృత్యం చేస్తున్న విద్యార్థినులు

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి శ్రీరామ్ జూనియర్ కళాశాలలో ఫేర్‌వెల్ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేశారు. కళాశాల అధ్యాపకులు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని, వాటిని సాధించేందుకు నిరంతరం కృషి చేయాలని సూచించారు. కళాశాలలో ఇటీవల నిర్వహించిన ప్రతిభ పరీక్షల్లో ఉత్తమ ర్యాంకులు సాధించిన 45 మంది విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ ఎం.భాస్కరరావు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జి.ప్రసన్నలక్ష్మి పాల్గొన్నారు.

అమ్మ భాష అమృతం

- ఘనంగా మాతృభాషా దినోత్సవం


లక్కవరపుకోట: మాతృభాష గొప్పతనాన్ని వివరిస్తున్న గురుకుల పాఠశాల విద్యార్థిని


లక్కవరపుకోట: జమ్మాదేవిపేట గురుకులంలో నిర్వహించిన వేడుకల్లో విద్యార్థినుల నృత్య ప్రదర్శన


చీపురుపల్లి: మాట్లాడుతున్న ఆదర్శ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ గోవిందరావు


శృంగవరపుకోట: మాట్లాడుతున్న డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రమేష్‌కుమార్

చీపురుపల్లి: మాతృ భాష అమృత సమానమని, ప్రతీ భావాన్ని స్వేచ్ఛగా వ్యక్తపరిచేందుకు అవకాశం ఉంటుందని స్థానిక ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ బి.గోవిందరావు అన్నారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ స్థాయిలో ఉన్నా మాతృభాషను మరిచిపో కూడదని అన్నారు. మాతృ భాషతోనే సంస్కృతి, సంప్రదా యాలు వికాసం చెందుతాయని, పిల్లలకు మాతృభాషను నేర్పించడం మరిచిపోకూడదన్నారు. తెలుగు అధ్యాపకుడు డాక్టర్ బి.విజయేశ్వరరావు మాట్లాడుతూ మాతృ భాష మరుపురాని భాష అని, మాతృ భాషతోనే విద్యార్థులు మనోవికాసం సాధించగలరని అన్నారు. అనంతరం విద్యార్థులకు తెలుగు భాష ప్రాముఖ్యతపై పలు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కళాశాల అధ్యాపకులు కె.మల్లేశ్వరరావు, జేకేసీ కో–ఆర్డినేటర్ టి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పద్యాలు, పాటల పోటీలు

లక్కవరపుకోట: మండలంలోని జమ్మాదేవిపేట గ్రామ సమీపంలోని మహాత్మా జ్యోతీరావు పూలే బాలికల గురుకుల పాఠశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు తెలుగు కవిత్వాలు, పద్యాలు,పాటలు పోటీలు నిర్వహించారు.పలువురు విద్యార్థినులు తెలుగుతల్లి వేషధారణలతో అలరించారు. ప్రిన్సిపాల్ య.విజయకుమార్ పాత్రో మాతృభాష ప్రాముఖ్యతను విద్యార్థినులకు వివరించారు. పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

పుణ్యగిరి డిగ్రీ కళాశాలలో..

శృంగవరపుకోట: పట్టణ శివారున పుణ్యగిరిలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాతృభాషా దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. తెలుగు విభాగం నేతృత్వంలో నిర్వహించిన కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ కేశవరావు మాట్లాడుతూ తెలుగుభాష ఔన్నత్యాన్ని, ఆవశ్యకతను వివరించారు. ఎన్ని భాషలు నేర్చుకున్నా, మాతృభాషే మన పునాది అని అన్నారు. వైస్ ప్రిన్సిపాల్ రమేష్‌కుమార్ మాట్లాడుతూ మాతృభాష మన సంస్కృతిని, సంప్రదాయాలను రక్షిస్తుందని, మాతృభాషలో ఉన్న సౌలభ్యం, గొప్పతనం మరే భాషలో ఉండదన్నారు. ఐక్యూ ఏసీ కో–ఆర్డినేటర్ రవీంద్రనాథ్, లెక్చరర్లు వాసుదేవరావు, వలీఖాన్, ఈరన్న, భాస్కర్, శ్రీనివాసరావు తదితరులు ప్రసంగించారు.

ఓపెన్ ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులాహ్వానం

వేపాడ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2022–23 విద్యా సంవత్సరానికి సంబంధించి ఓపెన్ ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కిలపర్తి అప్పారావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 27వ తేదీ వర కు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. పదోతరగతి ఉత్తీర్ణులైన వారు, ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల డ్రాఫ్ అవుట్స్ అయిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. ఆసక్తి గల విద్యార్థులు తమ ఆధార్, మొబైల్ నంబర్, ఎస్ఎస్‌సీ ఒరిజినల్ సర్టిఫికెట్, కులధ్రువీకరణ పత్రం, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు తీసుకుని కళాశాలలో సంప్రదించాలని సూచించారు. పరీక్ష ఫీజు మార్చి 1వ తేదీ నుంచి 7వ తేదీ లోగా డీవీఈఓ విజయనగరం వారికి చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 89852 49209 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

కొత్తవలస రూరల్: ఓపెన్ ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కొత్తవలస ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.భీమశంకరరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు ఈ నెల 27 వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థిని గెలిపించండి


ఎన్నిక ప్రచార కరపత్రాలను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

గుర్ల: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరఫున పోటీచేస్తున్న సీతంరాజు సుధాకర్‌ను గెలించాలని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వి.సూర్యనారాయణ రాజు, జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు పొట్నూరు సన్యాసినాయుడు పట్టభద్రులను కోరారు. మండల కేంద్రం లోని పార్టీ కార్యాలయంలో వారు ఎన్నికల ప్రచార వాల్‌పోస్టర్లు, కరపత్రాలను మంగళవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమం, అభివృద్ధికి సమప్రాధాన్యం ఇస్తున్నారని, ఆయన బలపరిచిన సీతంరాజు సుధాకర్‌ను గెలిపించి, ప్రభుత్వానికి పట్టభద్రులు మరింత మద్దతు తెలపాలని కోరారు. కార్యక్రమంలో బెల్లాన బంగారునాయుడు, తోట తిరుపతిరావు, జమ్ము స్వామినాయుడు, వెంకటరమణ, మొల్లి అప్పన్న, బూర్లె అప్పలస్వామి, ముద్దాడ దినేష్, వివేక్ తదితరులు పాల్గొన్నారు.

కరాటేతో ఆత్మరక్షణ


విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎస్‌ఐ ముకుందరావు

లక్కవరపుకోట: ఆత్మరక్షణ, దేహదారుఢ్యం, మానసిక వికాసానికి కరాటే ఎంతో దోహదపడుతుందని ఎస్‌ఐ ఎం.ముకుందరావు అన్నారు. ఈ నెల 7వ తేదీన విక్టరీ షూటోఖాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక శాంభవీ లేఅవుట్‌లో స్థానిక మోడల్ స్కూల్, స్వామి వివేకానంద పాఠశాల విద్యార్థులకు బెల్ట్ గ్రేడింగ్ టెస్టు నిర్వహించారు. ఈ టెస్టులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు వివేకానంద పాఠశాల ఆవరణలో సర్టిఫికెట్లు, జ్ఞాపికలను మంగళవారం అందజేశారు.ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల్లో రాణించే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని అన్నారు. విద్యార్థులకు కరాటే శిక్షణ ఇచ్చిన రాజు మాస్టారును అభినందించారు. మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కంది ధర్మకుమార్, వివేకానంద పాఠశాల ప్రిన్సిపాల్ బెహరా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళల్లో రక్తహీనత నివారణకు చర్యలు


వైద్యసిబ్బందితో సమీక్షిస్తున్న ఎంపీడీఓ బి.ఎస్.ఎన్.కె. పట్నాయక్

వేపాడ: రక్తహీనతతో బాధపడుతున్న బాలికలు, మహిళలకు ఆరోగ్య జాగ్రత్తలు, తీసుకోవాల్సిన మందులు, పౌష్టికాహారం తదితర అంశాలపై అవగాహన కల్పించాలని ఎంపీడీఓ బి.ఎస్.ఎన్.కె.పట్నాయక్ వైద్య సిబ్బందికి సూచించారు. బొద్దాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యసిబ్బందితో మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీహెచ్‌సీ పరిధి గ్రామాల్లో రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణులను, బాలింతలను గుర్తించాలని చెప్పారు. బాధితులకు తగిన ఆరోగ్య సూచనలు సలహాలతో పాటు మందులు అందించాలని కోరారు. వైద్యాధికారులు సతీష్‌కుమార్, రమాదేవీ పాల్గొన్నారు.


పోటీల్లో పరుగు తీస్తున్న ఎద్దులు

ఆకట్టుకున్న ఎడ్ల పరుగు ప్రదర్శన

వేపాడ: మండలంలోని నర్సిపల్లి మెట్ట సమీపంలో గాడి వారి కళ్లాల వద్ద ఆంజనేయస్వామి తీర్థం సందర్భంగా మంగళవారం సాయంత్రం నిర్వహించిన ఎడ్ల పరుగు ప్రదర్శన ఆకట్టుకుంది. 12 జతల ఎద్దులు పోటీల్లో పాల్గొనగా... మొదటి అయిదు స్థానాల్లో నిలిచిన ఎద్దులకు సంబంధించిన యజమానులకు ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు నగదు బహుమతులు అందజేశారు. తీర్థం సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు.

ఆర్టీసీ ఆదాయం రూ.3.89 లక్షలు

శృంగవరపుకోట: మహాశివరాత్రి సందర్భంగా ఈనెల 18, 19తేదీల్లో నిర్వహించిన జాతరకు పుణ్యగిరి, సన్యాసయ్యపాలెంకు నడిపిన ప్రత్యేక బస్సు సర్వీసుల ద్వారా ఆర్టీసీకి రూ.3,89,515 ఆదాయం వచ్చిందని డీఎం కె.రమేష్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 31 బస్సులతో ముందుగానే షెడ్యూల్ నిర్ణయించామని, పుణ్యగిరి, సన్యాసయ్యపాలెంకు 18వ తేదీ ఉదయం నుంచి 19వ తేదీ సాయంత్రం వరకు నిరంతరాయంగా బస్సులు నడిపామని పేర్కొన్నారు. 18వ తేదీన రూ.1,79,715, 19వ తేదీన రూ.2,09,800 మొత్తంగా రూ.3,89,515 ఆదాయం వచ్చిందని, 834 ట్రిప్పులు నడిపామని వివరించారు. గతేడాది రూ.3,75,626 ఆదాయం వచ్చిందని పేర్కొన్నారు. ఆర్టీసీ ఉద్యోగులు సమన్వయంతో రెండు రోజుల పాటు భక్తులకు ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు లేకుండా విధులు నిర్వర్తించారని, స్థానిక పోలీస్ సిబ్బందితో పాటు పూర్తి సహకారం అందించిన వివిధ శాఖల అధికారులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

శింగరాయిలో సమగ్రభూరీసర్వే

వేపాడ: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంలో భాగంగా మండలంలోని శింగరాయి రెవెన్యూ పరిధిలో భూరీసర్వేను సర్పంచ్ నిరుజోగి వెంకటరావు మండల సర్వేయర్ అప్పలనాయుడు ఆధ్వర్యంలో మంగళవారం ప్రారంభించారు. రైతులు ఎన్నోఏళ్లుగా ఎదుర్కొంటున్న భూసమస్యలకు భూరీసర్వేతో శాశ్వత పరిష్కారం లభించనుందని మండల సర్వేయర్ తెలిపారు. వీఆర్‌ఓ సత్యవతి, సచివాలయ సర్వేయర్లు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

దత్తిరాజేరు: మండలంలోని వంగర గ్రామంలో ఉపాధి పనులను ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం మంగళవారం పరిశీలించారు. వేతనదారులతో మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్ ఇచ్చిన కొలతల ప్రకారం పనిచేస్తే ప్రభుత్వం నిర్దేశించిన గరిష్ఠ వేతనం అందుతుందని చెప్పారు. ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో పనిప్రదేశంలో తాగునీరు, నీడ కోసం టెంట్లు, ప్రథమ చికిత్స కిట్లను తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలని ఫీల్డ్ అసిస్టెంట్‌కు సూచించారు.

మురుగు సమస్య పరిష్కారం


కాలువ వద్ద అడ్డుకట్టను జేసీబీతో తొలగిస్తున్న అధికారులు

గజపతినగరం: మండల కేంద్రంలోని బాలాజీ నగర్ కాలనీలో మురుగు సమస్యను నేషనల్ హైవే డీఈ నరసింగరావు, ఇన్‌చార్జి ఎంపీడీఓ పప్పు సుదర్శ నరావు, ఈఓపీఆర్డీ జనార్దనరావు పోలీస్ అధికారులు కలిసి మంగళవారం పరిష్కరించారు. తన స్థలంలో నుంచి మురుగు నీరు ప్రవహిస్తోందని ఓ ప్రైవేటు వ్యక్తి మురుగు నీటికి అడ్డుకట్ట వేశారు. దీంతో మురుగునీరు బాలాజీనగర్‌లోని నివాసాల్లో నిలిచిపోయింది. ఎట్టకేలకు అధికారులు మురుగునీటికి ప్రైవేటు వ్యక్తి వేసిన అడ్డుకట్టను మంగళవారం తొలగించడంతో సమస్య పరిష్కారమైంది.

పోలింగ్ కేంద్రాల సందర్శన


జామి: ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న ఎస్పీ దీపిక


దత్తిరాజేరు: పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

జామి: మార్చి 13న నిర్వహించనున్న ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి స్థానిక ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను ఎస్పీ ఎం.దీపిక సందర్శించారు. పోలింగ్ నిర్వహణకు అవసరమైన సదుపాయాలను పరిశీలించారు. బందోబస్తుకు అవసమైన ఏర్పాట్లపై స్థానిక పోలీసు అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఎన్నికలు ప్రశాంతంగా ముగిసేలా అన్ని భద్రతా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతర పోలీస్‌స్టేషన్‌లో తనిఖీలు చేశారు. కేసులకు సంబంధించిన సీడీ ఫైల్స్, రికార్డులను పరిశీలించారు. కేసుల దర్యాప్తు వివరాలను ఎప్పటికప్పుడు సీసీటీఎన్ఎస్‌లో అప్‌లోడ్ చేయాలని ఎస్‌ఐ వీరబాబుకు సూచించారు. త్వరలో నిర్వహించనున్న ఎల్లారమ్మ జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. సీఐ సింహాద్రి నాయుడు, తదితరులు ఎస్పీ వెంట ఉన్నారు.

దత్తిరాజేరులో..

దత్తిరాజేరు: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి స్థానిక ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాన్ని తహసీల్దార్ రమేష్, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం పెదమానాపురం, ఎస్.బూర్జివలస ఎస్‌ఐలు భాగ్యం, రాజేష్ మంగళవారం సందర్శించారు. తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, ఇతర వసతులు ఉన్నాయా లేవా అని క్షుణ్ణంగా పరిశీలించారు.

లింగ వివక్ష లేని సమాజం నిర్మిద్దాం


అవగాహన కల్పిస్తున్న హెల్త్ ఎడ్యుకేటర్ అనిల్‌ప్రేమ్‌కుమార్

జామి: లింగ వివక్ష లేని సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని స్థానిక పీహెచ్‌సీ హెల్త్ ఎడ్యుకేటర్ ఎన్.అనిల్‌ప్రేమ్‌కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు లింగ వివక్షత, పౌష్టికాహారం, సఖి గ్రూపులపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలపై లింగవివక్షత చూపరాదని, మగ పిల్లలతో సమానంగా ఆడ పిల్లలని కూడా చదివించి సమాజంలో ఎదగనిచ్చేలా గ్రామాల్లో ప్రజలను చైతన్య వంతం చేయాలని విద్యార్థులకు సూచించారు. ప్రతీ విద్యార్థి ఆరోగ్యంపై దృష్టిసారించాలని, జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలని చెప్పారు. రక్తహీనత సమస్య రాకుండా ఉండేందుకు విధిగా పౌష్టికాహారం తీసుకోవాలని అన్నారు. 9 నుంచి 21 ఏళ్ల లోపు ఆడపిల్లల కోసం ప్రత్యేకంగా రూపొందించిన సఖీ గ్రూపుల్లో ఆడపిల్లలు చేరాలని సూచించారు. బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. పాఠశాల హెచ్‌ఎం అబ్దుల్ రెహమాన్, ఆరోగ్య సహాయకులు లత, వైద్య సిబ్బంది సత్యప్రసాద్, ఎంఎల్‌హెచ్‌పీలు నిహారిక, లిఖిత, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

రెండురోజుల్లో ధాన్యం కొనుగోలు పూర్తి చేయాలి


జన్నివలసలో రైతులతో మాట్లాడుతున్న జేడీ వి.టి.రామారావు

జామి: 2022 ఖరీఫ్ సీజన్‌కి సంబంధించి ఇంకా మండలంలో రైతుల వద్ద ధాన్యం ఉంటే వాటి కొనుగోలు ప్రక్రియను రెండు రోజుల్లో పూర్తి చేయాలని వ్యవసాయశాఖ జేడీ వి.టి.రామారావు వ్యవసాయ అధికారులకు సూచించారు. మండలంలోని జన్నివలస, వి.ఆర్.పాలెం గ్రామాల రైతు భరోసా కేంద్రాల(ఆర్బీకే)ను మంగళవారం ఆయన సందర్శించారు. ఇప్పటివరకు చేపట్టిన ధాన్యం కొనుగోలు, తదితర అంశాలపై సిబ్బందిని ఆరా తీశారు వ్యవసాయ సహాయకులతో ఆయన మాట్లాడుతూ రబీ 2022–23 సీజన్‌కి సంబంధించి సాగులో ఉన్న పంటల ఈ– క్రాప్ నమోదు, రైతుల ఈకేవైసీ బుధవా రం సాయంత్రం లోగా శతశాతం పూర్తి చేయా లని సూచించారు. ఈకేవైసీ పూర్తయిన రైతులు తాము సాగు చేసిన అపరాల పంటలను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకోవచ్చని తెలిపారు. ఉచిత పంటల బీమా కూడా వర్తిస్తుందని చెప్పారు. వ్యవసాయ సహాయ సంచాలకులు ఎల్.విజయ, జన్నివలస సర్పంచ్ శీర చందునాయుడు,పెద్దలు వెంకటరావు తదితరులు ఆయన వెంట ఉన్నారు.

ఈ–క్రాప్ నమోదు తప్పనిసరి


బాగువలసలో మొక్కజొన్న పంట ఈ-క్రాప్ నమోదును పరిశీలిస్తున్న అధికారులు

చీపురుపల్లిరూరల్(గరివిడి): రైతులు తాము సాగు చేస్తున్న పంటల వివరాలను తప్పనిసరిగా ఈ–క్రాప్ నమోదు చేయించుకోవాలని వ్యవసాయ శాఖ గుంటూరు కమిషనరేట్ ఏడీఏ ఎం.ప్రేమ్‌కుమార్, జిల్లా జేడీఏ కార్యాలయ ఏడీఏ ప్రకాశ్ సూచించారు. చీపురుపల్లి మండలం సంకుపాలెం గ్రామంలో, గరివిడి మండలం బాగువలస గ్రామంలో వ్యవసాయ సిబ్బంది చేపట్టిన మొక్కజొన్న పంట ఈ–క్రాప్ నమోదు వివరాలను మంగళవారం వారు పరిశీలించారు. రైతులు ఏయే సర్వే నంబర్లలో ఎంత విస్తీర్ణంలో మొక్కజొన్న సాగు చేస్తున్నారో క్షుణ్ణంగా పరిశీలించారు. రబీ మొక్కజొన్న సాగు చేస్తున్న రైతులు ఈనెల 25లోగా ఈ–క్రాప్ చేసుకోవాలని సూచించారు. ఈ– క్రాప్ చేసుకుంటునే ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటకు నష్టం వాటిల్లినప్పుడు బీమా వర్తిస్తుందని, పంట విక్రయించుకోవాలనుకున్నా ఈ–క్రాప్ తప్పనిసరి అన్నారు. చీపురుపల్లి, గరివిడి మండల వ్యవసాయ అధికారులు రఘునాథ్, వి.శైలజ తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న, రామకృష్ణ

జామి: చక్కగా చదువుకుంటేనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని,పాఠశాల స్థాయిలోనే ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని, వాటి సాధన కోసం నిరంతరం కృషి చేయాలని సామాజిక పరివర్తన మార్పు సమాచార వ్యవస్థ జిల్లా సమన్వయ అధికారి బి.రామకృష్ణ విద్యార్థులకు సూచించారు. కుమరాం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సామాజిక అంశాలపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాత్కాలిక సరదాల కోసం చదువును నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్‌లో ఇబ్బందులు పడాల్సి ఉంటుందని అన్నా రు. విద్యార్థులు ప్రతీ సబ్జెక్టుపై పూర్తిస్థాయిలో పట్టుసాధించేందుకు ఉపాధ్యాయులు పాఠాలు బోధించేటప్పుడు ఏకాగ్రతగా వినాలని సూచించారు. అలాగే బాల్య వివాహాలతో కలిగే అనర్థాలు, రక్త హీనత, చేతుల పరిశుభ్రత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కిశోర బాలికలు విధిగా పౌష్టికాహారం తీసుకోవాలని, జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలని సూచించారు. హెచ్‌ఎం సీహెచ్.పద్మావతి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు


ఆర్‌ఓ ప్లాంట్‌లో తనిఖీలు చేస్తున్న తహసీల్దార్ అరుణకుమారి

గజపతినగరం: ఆర్‌ఓ ప్లాంట్ల నిర్వాహకులు నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని తహసీల్దార్ ఎం.అరుణకుమారి అన్నారు. పురిటిపెంటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదురుగా ఉన్న ఆర్‌ఓ ప్లాంట్‌లో మంగళవారం ఆమె తనిఖీలు చేశారు. ప్లాంట్ లైసెన్స్‌తో వాటర్ టిన్‌లను, యంత్రాలను, ప్లాంట్ పరిసరాలను పరిశీలించారు. సంబంధిత యజమానికి పలు సూచనలు చేశారు. పరిశుభ్రత పాటించాలని, తాగునీటిలో మినరల్స్ కలపడంలో జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. తహసీల్దార్ వెంట ఫుడ్ సేఫ్టీ, లీగల్ మెట్రాలజీ, రెవెన్యూ అధికారులు ఉన్నారు.

నవధాన్యాల సాగుపై అవగాహన


ర్యాలీ చేస్తున్న సుస్థిర వ్యవసాయ కేంద్రం సిబ్బంది

వేపాడ: ప్రకృతి వ్యవసాయంలో భాగంగా నవధాన్యాల సాగుతో కలిగే ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పిస్తూ సుస్థిర వ్యవసాయకేంద్రం రీజనల్ కో–ఆర్డినేటర్ పి.వెంకటరావు ఆధ్వర్యంలో కొండగంగుబూడి క్లస్టర్ పరిధి పాత ఊరు గ్రామంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దాయిరి ముత్యాలమ్మ, సర్పంచ్ బంగారయ్య, వర్రి సింహాద్రప్పడు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.